# గాంధీని చంపిన దేశం

సంధ్యాసమయం. ఆడ. మగ జంటలతో. తమకే బాధలూ లేవన్నట్లు కేరింతలు కొడుతూ ప్రసన్న వదనాలతో సర్దాగా పరుగులెడుతూ ఆడుకునే పిల్లలతో, గత అనుభవాల సుడిలో ఈదులాడుతున్న వృద్ధులతో నిండుగా, కనులవిందుగా వుంది పబ్లిక్ పార్కు. అస్తమయారుణ సువర్ణ కాంతిలో పచ్చని చెట్లు రంగు రంగుల పూవులు కొత్త అందాలను సంతరించుకుంటున్నాయి.

అక్కడే ఓ పక్కగావున్న సిమెంటు బెంచీమీద వెల్లకిలా పడుకుని.... ఆకాశంలోని మబ్బులకేసి చూస్తూ.... దీర్ఘాలోచనలో మునిగివున్నాడు మదన్. తను బి.ఏ. పాసయ్యాడు. హుం.... ఎందుకూ? ఎందుకా బి. ఏ. డిగ్రీ. బి. ఏ. పాసయి కనీసం రోజుకు కిలో బియ్యం సంపాదించలేకపోతున్నాడంటే ఎంత సిగ్గుచేటు. ఉద్యోగానికని- దరఖాస్తు ఫారాలకు పోస్టల్ ఆర్డర్స్‌కు ధారవోసిన డబ్బుల్తో ఓ చిన్న సైజు కిళ్ళీకొట్టు తెరిచుండవచ్చు.

ప్రతి ఆఫీసు గుమ్మంముందు "నో వెకన్సీ" బోర్డు వికృతంగా వేలాడుతుంటుంది. ఈ నిరుద్యోగమనే అనారోగ్యంతో ఎన్నాళ్ళు బాధపడాలి? కూలీ నాలీ చేసి కష్టపడి చదివించిన తల్లిదండ్రుల గుండెలపై కాలుతున్న చితిలా తను. ప్రతి క్షణం.... ప్రతి గడియ.... ప్రతి నిముషం భయంకర పిశాచిలా తన ముందు నృత్యం చేసే బి. ఏ. డిగ్రీ. సానుభూతి దృక్కులతో తన వైపు చూసే తల్లి - తండ్రి. ఏం చేయాలి? తనేం చేయాలి? ఉద్యోగాన్వేషణలో ముందుకు వెళ్ళలేక........ లంచాలు + రికమెండేషన్ల హోరుగాలి తాకిడికి తట్టుకోలేక.. ఎంగిలాకులా ఎగిరిపోతున్నాడు తను.

పార్కులో దీపాలు వెలిగాయి. అసహనంగా కదిలి లేచి కూర్చున్నాడు మదన్. కార్పొరేషన్ రేడియోనుంచి ప్రచారమవుతున్న "మనదేశంలో నిరుద్యోగ సమస్య పరిష్కారం" స్పీకర్‌నుంచి బిగ్గరగా వినిపిస్తోంది. మదన్ సాలోచనగా తల పంకించి లేచి....పార్కునుంచి వెలుపలికి నడవసాగాడు.

మదన్ నీరసంగా అడుగు లేసుకుంటూ ఆలోచనా వలయంలో గిరగిర తిరుగుతూ నడుస్తున్నాడు. నడుస్తూనే వున్నాడు. ఎడతెగని ఆలోచనలు....నడక....నడక ఆలోచనలు....తనకోసం...తన వారికోసం.... (తల్లి, తండ్రి) త్వరగా ఓ దారి చూసుకుని కన్నవారి కళ్ళల్లో కారుతున్న రక్త బిందువులను తుడిచివేయాలి. యిక ఉపేక్షించి ప్రయోజనం లేదు. ఏ రికమెండేషన్ లేని తనకు ఉద్యోగం ఎలాగూ రాదు. కనీసం ఏ పచారి కొట్లోనో గుమాస్తాగా కుదిర్తే. హుం ఈ జన్మకు యింతేనని ఎడ్జస్ట్ కావలసిందే. అయినా తనలాటి వాళ్ళకు పచారి కొట్లో గుమాస్తాగా కాక ఎలాంటి ఉద్యోగం లభిస్తుంది? అంతవరకూ నయం. యిప్పటికైనా ఆత్మవంచన చేసుకోగలిగినందుకు. సైడుకాలువ మీద ఈగల్లా రొద చేస్తున్న ఆలోచనా తరంగాలను ఆవలికి నెట్టి ముందుకు నడుస్తున్నాడు మదన్.

గాంధీరోడ్ సెంటర్లోకొచ్చి ఆగాడు. తను వెళ్ళాల్సిన దూరం యింకా వుంది. రెడ్ బిల్డింగ్స్ కాలనీ దాటితేగాని తనిల్లు రాదు. మదన్ అక్కడనుండి తాపీగా రెడ్

## మినీ కథా వీథి

బిల్డింగ్స్ కాలనీ వైపు సాగిపోయాడు.

రెడ్ బిల్డింగ్స్ కాలనీ పోలీస్ స్టేషన్ ఎంట్రన్స్‌వద్ద చాలా తక్కువకాంతితో వెలుగుతోంది ఎలక్ట్రికల్ బల్బు. ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసువద్ద పడిగాపులు కాస్తున్న నిరుద్యోగుల గుంపులా దీపం పురుగులు మండుతున్న బల్బుచుట్టూ చిన్నపాటి శబ్దంతో గిరికీలు కొడుతున్నాయి. హెడ్ కానిస్టేబుల్ వీరాస్వామి స్టేషన్ బయట కాలు కాలిన పిల్లిలా తిరుగుతున్నాడు. లోపల రూమ్‌లో స్టేషన్ రైటర్ ఫైల్స్ ఏవో చూసుకుంటున్నాడు. గేటు దగ్గర రైఫిల్ చేతపట్టుకుని.... నిల్చునివున్నాడో పోలీసు కానిస్టేబుల్.

అదే సమయంలో పోలీస్ స్టేషన్ ముందునుంచి నడిచివెళుతున్నాడు మదన్. హెడ్ కానిస్టేబుల్ వీరాస్వామికి మదన్‌ని చూడగానే పోతున్న ప్రాణం.... తిరిగి వచ్చినట్లుంది. వీరాస్వామి మదన్నుద్దేసించి "యిదుగో అబ్బాయ్! యిలారా!" అన్నాడు. వీరాస్వామి కేకతో ఆగిన



### నైనారు మురళి

మదన్ ఏవిటన్నట్లు చూశాడతనివైపు.

వీరాస్వామి అన్నాడు "చిన్న సాయం చేయాలి. లోపల గదిలో ఓ కొయ్యపెట్టె వుంది. దాన్ని బయటకు పట్టాలి. మదన్‌కు నీరసంగా వున్నా పెద్దవాడు పైగా ప్రభుత్వాధికారి చెప్తున్నాడు కదాని "అటాగేనండి" అన్నాడు. మదన్ వీరాస్వామిని అనుసరిస్తూ.

వీరాస్వామి మదన్‌ని స్టేషన్‌లోకి తీసుకువెళ్ళి లాక్ చేసివున్న ఓ సెల్ ఓపెన్‌చేసి అందులోవున్న కొయ్య పెట్టెని చూపి "ఆ పెట్టెను బయటపెట్టాలి" అన్నాడు.

జారిపోతున్న ప్యాంటును పైకి లాక్కుంటూ నాలుగడుగులు లోనికివేశాడు మదన్. వెనుక తలుపు మూసిన చప్పుడైతే....తిరిగిచూసి అదిరిపోయాడు.

వెలుపల వీరాస్వామి సెల్ తలుపు మూసి లాక్ చేస్తున్నాడు. మదన్ కేమీ పాలుపోలేదు. వెంటనే షాక్‌నుంచి తేరుకుని "సార్! ఏవిటి సార్! నన్ను లోపల పెట్టి తాళం వేస్తున్నారు. తలుపు తీయండి సార్!" అన్నాడు గట్టిగా.

సెల్ బయట వీరాస్వామి స్వగతంగా అనుకుంటున్నాడు. "నేనూ మనిషినే! ప్రతినెలా కేసులు ఎలా పట్టను. వీడితో.. ఈ మాసం .... మూడు కేసులు పూర్తయ్యాయి. మరి పై మాసం?"

నీళ్ళు నిండిన కళ్ళతో...చతికిలపడ్డాడు మదన్. ఎదురుగా గోడమీద వ్రేలాడుతున్న....ఫొటోలో బోసినవ్వుతో-గాంధీ తాత. కటకటాల కమ్మీల మధ్యనుంచి.... గాంధీని చూస్తున్నాడు మదన్. మరి గాంధీ కూడా మదన్‌ను చూస్తున్నాడా?